# థ్రిల్లింత

''ఇవాల్టి నుండి మనకు ఎకనమిక్స్‌కు కొత్త మాష్టారు వస్తున్నారట'' అంది సుజాత రోహిణితో.

రోహిణి ఇహలోకంలో లేదు. ఆమె మనసు పాడుతోంది 'ఉన్నావా... అసలున్నావా... ఉంటే కళ్ళుమూసుకున్నావా...?' అని. నిజంగానే ఆమెకు జీవితం నిస్సారమనిపిస్తోంది. దేవుడి అస్తిత్వం మీదే సందేహం కలిగింది ఆమెకు. 'వాడనే వాడు ఉంటే తన్నిలా బోరింగ్ క్లాసులో కూర్చోబెట్టి జీవితానందమంతా లుప్తం చేస్తాడా? ఏవిటీ జీవితం? ఎందుకీ బతుకు? ఎందుకీ చదువు' అన్న గహన తత్త్వచింతలో పడిపోయింది ఆమె.

ఆమె విన్పించుకోకపోయే సరికి భుజం తట్టి, ''నిన్నేనే... ఎకనమిక్స్‌కి కొత్త కుర్ర మాష్టారు వస్తున్నారట'' అంది సుజాత.

''హాయ్. వెరీగుడ్ న్యూస్. ఈ కొత్త మాష్టార్ని ఓ పట్టు పట్టి చూడాలి'' అంది రోహిణి. ఆమె దిగులు తీరిపోయింది. కొత్త ఉత్సాహం ఉరకలు వేసింది. రోజూ పాత లెక్చరర్ల మొహాలు చూసి చూసి విసిగిపోయి ఉంది. రోజూ పాత మొహాలు చూడటంలో థ్రిల్ ఏముంది?

''షల్ ఐపాస్ అన్డ వర్డ్'' అడిగింది సుజాత. ''ఊఁ...కానీ...'' అని ప్రోత్సాహమిచ్చింది రోహిణి. క్లాసులో ఒకరి తరువాత ఒకరికి ఉప్పు అందసాగింది. అమ్మాయిల నుండి అబ్బాయిలకు పాకింది. అసలే కోతి మూక. హీరోలు కాలరెత్తారు.

రోహిణికి చాలా రోజుల తరువాత థ్రిల్ కల్గించే సంఘటన జరగబోతోంది. ఆమె మనసు ఊహిస్తోంది. 'విద్యార్థి బృందం కోళ్ళూ, కొక్కిరాయిలూ, కుక్కలూ, గాడిదలూ అయి వచ్చే మాష్టారికి ఆహ్వానం పలుకుతారు. అది ఎప్పటి నుండో వస్తున్న ఆనవాయితీ. దాంతో సగం డంగైపోతాడు మాష్టారు. కాళ్లల్లో వణుకు ప్రారంభమవుతుంది. నుదుట చెమట పడ్తుంది. ఇహ మెల్లగా ఒక్కొక్కరూ చొప్పదంటు ప్రశ్నలేయటం మొదలెడ్తారు. ఆయనకు మాట తడపడ్తుంది. కొన్ని ప్రశ్నలు ఆయన్ని పనిగట్టుకుని అవమానించేటట్లుగా ఉంటాయి. ఆయన మొహం ఎర్రబడిపోతుంది. మాష్టారు పచ్చటి మనిషైతే బావుంటుంది. కోపంతో ఎర్రబడి కోతి ముఖంలా ఉంటుంది. ఇంతకీ ఆయన మనిషెలా ఉంటాడు?'

''నువ్వుగాని చూశావా ఆయన్ని, మనిషెలా ఉంటాడు?'' అడిగింది రోహిణి సుజాతని.

''చూడ్లా, ఎవరో చెప్తుంటే విన్నా.''

''ఏం విన్నావు?''

''కొత్త ఎకనమిక్స్ సార్ వస్తున్నాడని''

''అంతేనా, మనిషిని వర్ణించలేదా ఎవరూ?''

''బావుంది, మనిషెలా వుంటేనేం?''

''చచ్చు మొహం దానా, నీ కంత కంటే ఏం తెలిసి ఏడుస్తుందిలే!''

రోహిణికి కోపం రావటంలో అర్థం ఉంది. సగం సగం పనులా! విషయ సేకరణ చేసే వాళ్లు సొంతం చేయద్దూ?

''అదుగో సార్ వచ్చేస్తున్నారు'' అన్నారు ఎవరో

రోహిణిలో ఉత్కంఠ పెరిగిపోయింది. 'వస్తున్నాడు - పచ్చగా, పొడుగ్గా, గుబురు మీసాలతో, వంకుల జుట్టుతో సినిమా హీరోలా ఉండే మాష్టారు వస్తున్నాడు' అనుకుంది ఆమె. మాష్టార్లు హీరోల్లా ఉండాలని ఎందుకనుకుంటుందో ఆమెకే తెలియదు. ఆమెకు ప్రతిదీ థ్రిల్లింగానే ఉండాలి. అందుకనే ఆమె ఆలోచనలు తలా తోకా లేకుండా గాలిలో తేలుతుంటాయి.

అలా ఆమె ఊహల వియత్తలంలో విహరిస్తుండగా వచ్చాడు మాష్టారు. 'ఛీ, ఛీ' ఇదేం మనిషి? సన్నగా చామనచాయతో, నున్నగా ఓ పక్కకు దువ్వుకున్న క్రాఫుతో ఉన్నాడు. ఉంగరాల జుట్టు ముఖం మీద పడ్తుంటే, సుతారంగా చేత్తోపైకి తోసుకోని మనిషేం మనిషంట! మీసాలే లేవు. ప్చ్...' పెదవి విరిచింది రోహిణి. ఆమె ఉత్సాహమంతా నీరుగారిపోయింది.

'ఇంత సాదా సీదా మనిషిని ఆట పట్టించి ఏం ప్రయోజనం? ఒట్టి దండగ' అనుకుంది ఆమె. అయితే ఆమె సహ విద్యార్థులు అలా జారిపోయే మనస్తత్వమున్న వాళ్లు కాదు. సంప్రదాయాభిమానులు. ఆయనలా క్లాసులో అడుగిడగానే ఓ మార్జాలం 'మ్యావ్ మ్యావ్'మంది. సహజ శత్రుత్వాన్ని మర్చిపోలేని కుక్క ఒకటి 'భౌ భౌ' మంది. తనకు గాని పనులకు పోయే గాడిద ఒకటి ఓండ్ర పెట్టింది. ఓ కప్ప 'బెకబెక'లాడింది. ఓ పాము 'బుస్సు'మంది.

కొత్త లెక్చరర్ నవ్వుతూ డయాస్‌మీదకెక్కాడు. టేబిల్ కానుకుని నిలబడి ఓసారి క్లాసంతా కలియచూశాడు. ''బావుంది. మన క్లాసులో ఇంత మంది కళాకారులున్నారని తెలిసి నాకు చాలా ఆనందంగా ఉంది. అందరూ ఇలా ఒక్కసారే మిమిక్రీ చేస్తే ఎవరు గొప్పో తేల్చుకోవటం కష్టం. ఒక్కొక్కరికే అవకాశం ఇస్తాను. ముందు అవకాశం శునకరాజాని కిద్దామా, మార్జాలమణి కిద్దామా?'' అన్నాడు ఆయన.

ముందు లేచినవాడు కుక్కో, పిల్లో అవుతాడు. అందువల్ల క్లాసు మొత్తం కుక్కిన పేనయింది. రోహిణికి వాతావరణం నచ్చలేదు. 'కాళ్లు గజగజ వణకని కొత్త లెక్చరరా ఓ లెక్చరరే?' అనుకుంది ఆమె.

''లేదు సార్! మా వాళ్లంతా మీరాకకు తమ ఆనందాన్ని రకరకాలుగా వ్యక్తపరుస్తున్నారు'' అంది లేచి నిలబడి.

ఆమెను చూసి ధైర్యం తెచ్చుకుని 'హాచ్'మని తుమ్మాడో ప్రబుద్ధుడు వెనక బెంచీ లోంచి.

''వెరీ గుడ్. ఐ ఆల్సో ఎంజాయిట్. జంతుదశలో మర్చిపోయిన ఆనందాన్ని మళ్ళీ వెనక్కు తెచ్చుకోవాలని చేసే మీ ప్రయత్నం ప్రశంసనీయమే. మరి నీపాత్ర ఏమిటి? కోడా...! కొక్కిరాయా? పామా...? తేలా...?'' అన్నాడు ఆయన.

రోహిణి మాట్లాడకుండా కూర్చుంది.

''తేళ్ళు అరుస్తాయా, సార్!'' అన్నాడు ఓ విద్యార్థి లేచి.

''అయ్యా! ప్రతిదానికీ మీరలా లేవకండి. కాళ్లు నెప్పులు పుట్టేస్తాయి. 'తేళ్లు అరవవు' అని చాలా గొప్ప విషయం తెలుసుకున్నావు. నిన్నెంతో మెచ్చుకోవాలి. కానీ ఏం చేస్తాం మన దేశంలో నీలాంటి గొప్పవాళ్లకు స్థానం లేకుండా పోతున్నది. ఇంక అటెండెన్స్ తీసుకుంటాను. మనుషులకే నంబర్లుంటాయి, జంతువులకు కాదు. అందువల్ల మనుషులే హాజరు పలకాలని నా ఆకాంక్ష'' అని టేబిల్ చుట్టూ తిరిగి వెళ్లి కుర్చీలోకూర్చుని వరుసగా నెంబర్లు పిలవసాగాడాయన. పిల్లలు బుద్ధిమంతుల్లా హాజరు పలికారు.

రోహిణికి థ్రిల్ పోయింది. 'మరీ ఇంత కొరకరాని కొయ్యేం. సిగ్గులేని మొహానికి నవ్వే సింగారమన్నట్టు పెదాల మీద చిరునవ్వు కూడాను' అనుకుంది.

హాజరు తీసుకున్న తరువాత ఆర్థిక శాస్త్రం, దాని స్వరూప స్వభావాలు, మిగతా సామాజిక శాస్త్రాలతో దానికున్న సంబంధం గూర్చి ఉపన్యసించాడాయన. అది బి.ఏ మూడవ సంవత్సరం క్లాసు. ఎప్పుడో మొదటి సంవత్సరంలో అయిన పాఠం ఆయన చెప్పినా ఎవరూ మాట్లాడకుండా విన్నారు.

క్లాసయిపోయి స్టూడెండ్స్ బయటకు రాబోతుంటే ''మీ ఇళ్లల్లో ఎవరి ఇంట్లోనయినా ఓ గది అద్దెకు దొరికేటట్లయితే చెప్పండి. పొద్దున్నే వచ్చాను, ఈ ఊరు. నివాసం ఏర్పరుచుకోవాలి కదా'' అన్నాడాయన నవ్వుతూ.

''మీ ఇంట్లో ముందు గది ఖాళీనే గదే. ఇంతకు ముందు ఆ గది అద్దెకిచ్చారు కదా! మరి మాష్టారి కివ్వరాదూ అది'' అంది సుజాత రోహిణితో, క్లాసు రూములో నుండి బయటకు వచ్చేటప్పుడు.

''అమ్మా వాళ్ల నడగొద్దూ!'' అంది రోహిణి.

''ఆయన్ని తీసికెళ్లి చూపించు. ఆయనకూ నచ్చాలి కదా!''

''అవును. పద చెబ్దాం''

''సర్...'' అని పిల్చింది సుజాత.

అతను వెనక్కి తిరిగాడు.

''వీళ్లింట్లో ఓ గది ఖాళీగా ఉంది. మీరు చూస్తారేమోనని...''

''అలాగే, సాయంత్రం కలువు. మీ ఇంటికెళ్దాం. నీ పేరేంటి?'' అన్నాడతను రోహిణివైపు చూస్తూ.

''రోహిణి!''

''మంచి పేరు. సాయంత్రం కలుద్దాం'' అని ఆయన స్టాఫ్ రూం వైపు వెళ్ళిపోయాడు.

తరువాతి క్లాసు పొలిటికల్ సైన్స్. బోరింగ్ పీరియడ్. పాపం ఆయన పాఠం బాగానే చెప్తాడు. ఎంతసేపూ ఒక్క జోకు వేయకుండా ఒట్టి సబ్జెక్ట్ చెప్పే టీచర్లంటే రోహిణికి మంట. ఇలాంటి వాళ్ల వల్లే జీవితం దుర్భరమైపోతోంది అని ఆమె అభిప్రాయం. పాఠం వినటంలో ఏం థ్రిల్ ఉంటుంది? 'కొత్త ఎకనమిక్స్ లెక్చరర్ పరవాలేదు. ఒట్టి పాఠమే చెప్పి బోరు కొట్టించలేదు. మనిషి సాదాసీదాగా ఉన్నా పేరయినా బావుంటుందా? అసలు ఆయన పేరేమిటో, చక్కగా గిరీష్ అనో, వసంత్ అనో, రాజేష్ అనో, ప్రమోద్ అనో మూడక్షరాల ముచ్చటి పేరు ఏదో ఉండి ఉండాలి.'

ఇహంలోకి వచ్చి, విలన్ లాంటి పొలిటికల్ సైన్స్ లెక్చరర్‌ను చూసి ఉత్సాహాన్ని తమాయించుకుని మెల్లగా అడిగింది సుజాతని రోహిణి. ''ఇంతకీ ఎకనమిక్స్ సార్ పేరేంటే''అని

''నరసింహమూర్తి అట.''

''ఛీ, ఛీ. ఇదేం పేరు. పాత చింతకాయ పచ్చడి పేరు''

''నయం. ఆయన పూర్తిపేరు యన్‌వివివి నరసింహమూర్తట. యన్ ఇంటిపేరు. మూడు ''వి''లు- వీర వరాహ వేంకట - అయుండాలి. వెరసి వీరవరాహ వేంకట నరసింహమూర్తి.''

''చచ్చాం. ఈయనకు మా ఇంట్లో స్థానంలేదు'' అంది రోహిణి.

''అదేంటే పేరును చూసి ఇల్లు అద్దెకిచ్చేట్టున్నావు?'' అంది సుజాత.

''ఇంత పురాతనమైన బి.సి.కాలపు పేర్లున్న మనిషి భావాలుకూడా చాదస్తంగానే ఉంటాయి. సాయంత్రం ఆయన్ని మా ఇంటికి పిల్చుక వెళ్ళవద్దు'' అంది రోహిణి. 'మనిషి సరే, పేరులో కూడా ఓ థ్రిల్లింత లేదు. ఓ త్రుళ్లింత లేదు' అని సణుక్కుంటూ.

''ఓసారి అన్నతరువాత బావుండదు. అయినా పేరునుబట్టి మనిషిని అంచనా వేయటం ఎంతవరకు సబబు?''

రోహిణికి సుజాత మాటల్లోని సత్యాన్ని ఒప్పుకోక తప్పలేదు.

సాయంత్రం ఆయన్ని తమ ఇంటికి తీసుకెళ్ళాల్సి వచ్చింది. తమ ఇల్లు ఆయనకు నచ్చకుండా ఉండాలని దేవుడికి మొక్కుకుంది. 'ఎందుకు నచ్చుతుందిలే కాలేజీకి దూరంకూడా కదా!' అనుకుంది. ఆయనకు రోహిణి చూపించిన గది నచ్చింది. కాలేజీలో ఉంచిన తన పెట్టే, బెడ్డింగూ తెప్పించుకుని ఆ రోజే ఆయనా గదిలో చేరాడు.

''మాష్టారూ! గది ఊడవటానికీ, గుడ్డలవీ ఉతకటానికీ పని మనిషిని మాట్లాడిపెట్టమంటారా?'' అని అడిగాడు రోహిణి తండ్రి శివరావు.

''అక్కర్లేదండీ! ఎంతపని ఉన్నది కనుక. నాపన్లు నేను చేసుకోవటం నాకలవాటే'' అన్నాడు అతను.

దాంతో రోహిణికి చిరాకు వేసింది. 'ఛీ! వట్టి ఆముదం తాగిన ముఖం. కాలేజీ లెక్చరరట. ఓ స్టేటస్‌లేదు, పాడులేదు. తన పని తానే చేసుకుంటాడట. ఈయన్తో ఇక మాట్లాడితే ఒట్టే' అనుకుంది రోహిణి.

అయితే ఆమె ఒట్లు ఎక్కువ కాలం నిలవలేదు. క్లాసులో అతని పాఠాలు వినకూడదని నిశ్చయించుకుని వెళ్ళినా, ఆమె నిశ్చయం సడలిపోయింది. అతను పాఠం చాలా బాగా చెప్పేవాడు. విషయం సులభంగా అర్థం కావటానికి నిత్యజీవితంలోని ఉదాహరణలిచ్చేవాడు. ఆ ఉదాహరణల ద్వారా సిద్ధాంత ప్రతిపాదనలు చేసేవాడు. మధ్య మధ్యలో సున్నితమైన హాస్య ప్రసంగం చేసేవాడు. 'ఫరవాలేదు' అనుకుంది ఆమె. కానీ ఆమె రాజీపడలేదు. కొద్దిరోజుల్లోనే తన ఇంట్లో ఆయన గదికి విద్యార్థులు రాసాగారు. గంటల తరబడి వాళ్లతో ఏం మాట్లాడతాడో ఆమె కర్థం కాలేదు. విద్యార్థుల్లో అతనంటే ఆరాధన పెరగసాగింది. ఎంతమంది ఆయన గదికి వస్తున్నా తను మాత్రం వెళ్లేది కాదు, మాట్లాడేది కాదు.

రోహిణికి తను అందంగా ఉంటుందన్న ఓ అహంభావం ఉంది. అంతరాంతరాల్లో ఆమెకు అనుమానమే. ఈ వీర వరాహ వేంకట నరసింహమూర్తి తమ ఇంట్లో అద్దెకు దిగింది తన అందం పట్ల ఆకర్షితుడయ్యేనని 'లేకపోతే కాలేజీకి దూరంగా, ఎక్కువ అద్దెకిచ్చిన తమ గదిలో దిగటానికి కారణమేమిటి? వేరే కారణమేం లేదు. తనను చూసి ఆకర్షితుడయ్యే తమ గదిలో దిగాడు. లేకపోతే తను మాటవరుస కనంగానే తన వెంటపడి రావాలా? బహుశ, తనతో మాట్లాడాలి, పరిచయం పెంచుకోవాలి అని ఆరాటపడ్తూ ఉండవచ్చు. తను మాత్రం అలాంటి

అవకాశం ఇవ్వదు కాక ఇవ్వదు. ఇలాంటి జిడ్డు మొహమా తన్ను ఆకర్షించేది!' అని అనుకునేది ఆమె. అలా దూరంగా ఉంటూ థ్రిల్లింత ననుభవించసాగింది.

అయితే నరసింహమూర్తి తమ గదిలో దిగి రెండు నెలలయినా తనను గుర్తించకపోయే సరికి ఆమెకి తను అనుభవిస్తున్న థ్రిల్‌లో గాఢత లోపించి నట్లయింది. 'ఏమిటీ పెద్దమనిషి తనను పలుకరించనే పలుకరించడు. తనున్నట్టుకూడా గుర్తించడు. వట్టి జడపదార్థం' అనుకుంది. జీవితంలో థ్రిల్ లేని నిశ్శబ్దత ఆమె భరించలేదు. అందువల్ల ఓరోజు అతను కాలేజీ నుండి ఇంటికి వస్తూంటే మాటలు కలిపింది. ''సార్, సార్!'' అని పిలిచి.

''హలో! రోహిణీ! నువ్వా రా, రా!'' అన్నాడతను నవ్వుతూ.

''మీరు ట్యూషన్లు చెప్తారా, మాష్టారూ?'' అనడిగింది ఆమె అమాయకంగా.

''ట్యూషన్లా! ట్యూషన్లెందుకు?'' అన్నాడతను అర్థంకాక.

''మరి రోజూ మా క్లాసుమేట్స్ వస్తున్నారుగా మీ గదికి.''

''ఓ, అదా, కబుర్లు చెప్పుకోవటానికి''

''అంత కబుర్లు ఏముంటాయబ్బా!''

''ఎందుకు లేవు? మనిషి, జీవితం, ప్రకృతి, సమాజం - ఎన్ని విషయాలు? మనం అనుక్షణం బతికే జీవితంలో ఎన్ని అనుభవాలు. ఆలోచనల్లో స్పష్టత రావటానికీ, భావ వ్యక్తీకరణ పెంపొందించుకోవటానికీ మాట్లాడుకోవటం, చర్చించుకోవటం మంచి సాధనం. వచ్చే విద్యార్థులకు నా సబ్జెక్ట్ గురించేం చెప్పను. మిగతా విషయాల గురించి మాట్లాడుకుంటాం. నువ్వూరా, ఎప్పుడూ క్లాసు పుస్తకాలు చదువుతూ, వాటికే పరిమితమయి ఉంటే మనం ఎదిగేదెలా!'' అన్నాడతను.

''రోజూ పౌష్టికాహారం తింటే బాగా ఎదగొచ్చు'' అంది ఆమె జోక్ చేస్తున్నట్టుగా.

''అవును ఎదగొచ్చు. తలలో బరువుండదు కాబట్టి పొడుగ్గా తాటిచెట్టంత ఎదగొచ్చు.''

''అదేంటిసార్! తాటి చెట్టంత ఎదుగుతారా ఎవరయినా?''

''అదే నేనూ చెప్పేది. శరీరం ఎదుగుతుంది, ఓ వయస్సు వచ్చేవరకూ. అయితే, ఆ తర్వాత మనిషి ఎదగటం మానేస్తాడా? మానసికంగా ఎదుగుతాడు. చచ్చేంతవరకూ ఈ పెరుగుదల సాగుతూనే ఉంటుంది. ఎప్పుడు మనం ఎదగటం మానేస్తామో, అప్పుడు మనం జీవమున్న మనుషులం కాదు. చలనం, చేతనత్వం జీవించటానికి చిహ్నం. భౌతిక శరీరంలో చైతన్యం నశిస్తే, అంటే నాడి కొట్టుకోకపోతే - ఆ వ్యక్తి చచ్చిపోయాడంటాం. ఆ శరీరాన్ని కాటికి పంపేస్తాం. అలాగే మానసిక చైతన్యం లేకపోతే ఆ వ్యక్తి జీవన్మృతుడు. మా మాష్టారు ఒహోయన చెప్పేవారు

- మనుషులు రెండు రకాలు. మృతజీవనులు, జీవన్మృతులు అని. చచ్చికూడా బతికుండేవాళ్ళు మొదటి రకం, రెండో రకం బతికుండి కూడా చచ్చిన వాళ్ళతో సమానం...''

''ఈ చావు బ్రతుకుల గురించి వద్దు, మాష్టారూ ఇంకేమయినా చెప్పండి'' అంది రోహిణి.

''నేను చెప్పింది చావు బతుకుల గురించి కాదు. మనిషి మానసికంగా ఎలా ఎదగాలా అన్న విషయం గూర్చి. పోన్లే అది వదిలేద్దాం. ఈ చెట్టూ చేమా, ప్రకృతీ, మనిషీ, జీవితం, సాహిత్యం, ప్రేమ, ఇంకా సవాలక్ష సబ్జెక్ట్‌లలో నీకేదిష్టమో చెప్పు- దాన్ని గురించి మాట్లాడుకుందాం.''

''అమ్మో! ఇన్ని సబ్జక్టులు మీరు చదివారా, మాష్టారూ!'' అంది వెక్కిరింపుగా.

''చదవకేం కొంత చదివాను. మనుష్యుల్ని చూసి కొంత నేర్చుకున్నాను. ఈ ప్రపంచం పట్ల మనకు కొంత అవగాహన ఉండాలి కదా! దట్స్ వై ఐ ఎంకరేజ్ డిస్కషన్స్ అమాంగ్ స్టూడెంట్స్. అప్పుడు మనకు ఈ ప్రపంచంలో సమాజంలో మన స్థానం, మన బాధ్యత, సమాజాన్ని గూర్చిన చింతన మొదలవుతాయి. మరి నువ్వూ ఎదగాలిగా తాటిచెట్టంత - అంటే మానసికంగా. కనుక నువ్వూ వాళ్ళతో డిస్కషన్స్‌లో కలిసి పో. నేను సూచనగా ఓ సబ్జెక్ట్ అందిస్తాను. ఇహ మనవాళ్ళు వాగ్వాదం మొదలెడ్తారు. వాదాలు జోరుగా, ఒకోసారి చాల ఎన్‌లైటనింగ్‌గా జరుగుతాయిలే'' అన్నాడతను.

''అవును. నేనూ రావాలనే అనుకుంటున్నా మాష్టారూ!'' అంది ఆమె.

విషయం తెల్చుకోకుండా నిద్రపట్టదు రోహిణికి. అందువల్ల ఆరోజు మిగతా విద్యార్థులు ఆయన గదిలో జమ కూడగానే తనూ వచ్చింది. ఆమె వెళ్ళేటప్పటికే చర్చలు మొదలయ్యాయి. విషయం - ప్రకృతి. 'చెట్టూ-చేమా, కొండలూ - కోనలూ, నదీ - నదాలు, సముద్రం, గ్రహాలు - ఉపగ్రహాలు, విశ్వాంతరాళం అన్నీ ప్రకృతిలో భాగాలే. ఈ ప్రకృతి మానవుడిలో ఎలా ప్రతిఫలిస్తుంది. మానవుడూ ఈ ప్రకృతిలో భాగమేనా? ప్రకృతి ఉత్పాదక శక్తికి మూలమా?' అంటూ నరసింహమూర్తి చర్చ మొదలెట్టాడు.

విద్యార్థులు రకరకాలుగా చర్చించారు. వ్యాఖ్యానించారు. ఆ చర్చల్లో తనకూ ఏదో థ్రిల్ కన్పించింది రోహిణికి. నరసింహమూర్తి విద్యార్థుల్ని ఏడుగంటల తరువాత తన గదిలో ఉండనిచ్చేవాడు కాదు. ''ఇహ వెళ్ళి పాఠాలు చదువుకోండి'' అని పంపేవాడు. తను మాత్రం ఒకోరోజు రాత్రి ఒంటిగంట దాకా చదువుతూ గడిపేవాడు. ఏం చదువుతాడో రోహిణికంతుబట్టలేదు. 'హాయిగా సినిమాల కెళ్ళగూడదూ?' అనుకునేది ఆమె.

అతనితో మాట్లాడటానికి ఏ విషయంలోనయినా జంకు కలిగేది కాదు విద్యార్థులకు. అతనూ అలా జంకాల్సిన పనిలేదని ప్రోత్సాహ పర్చేవాడు. ఓసారి చర్చ 'ప్రేమ' మీద సాగింది. రసవత్తరంగా సాగింది. ఏడు గంటలకు విద్యార్థులంతా వెళ్ళిపోయినా ఆమె ఇంకా గదిలోనే ఉండిపోయింది. ''ఇహ నువ్వూ పద'' అన్నాడు అతను.

''అసలు ప్రేమంటే ఏమిటి, మాష్టారూ?'' అని అడిగింది రోహిణి సాలోచనగా.

''గట్టి చిక్కు ప్రశ్నే వేశావు. మరి ఇప్పటిదాకా ఏం విన్నావు? సరే, నువ్వేమనుకుంటున్నావో చెప్పు'' అన్నాడు - అతను ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ.

''ఏమో నాకు తెలీదు'' అంది ఆమె తలవంచుకుని.

ఓ క్షణమాగి, ఎటో శూన్యంలోకి చూస్తూ, తల పంకించి అన్నాడు అతను.

''ప్రేమంటే సాన్నిహిత్యం వల్ల కలిగే అభిమానం. నేనీగదిలో అద్దెకుంటున్నాను. దీనికి అలవాటయి పోతాను. దీనిమీద కొంత మమకారం ఏర్పడుతుంది. మీరు గది ఖాళీచేయమన్నారనుకో, అప్పుడు కొంత బాధ కలుగుతుంది, దీన్ని విడిచి వెళ్లిపోవటానికి. ఓసారి నా చెయ్యి ఫ్రాక్చరయితే మోచేయి నుంచీ, వేళ్లదాకా ప్లాస్టరు వేశారు. నెల రోజుల తరువాత తీసివేశారు. అయితే ఈ నెల రోజుల్లో నా కాప్లాస్టరంటే సాన్నిహిత్యం, ప్రేమ మొదలయ్యాయి. అది తీసి వేసిన రోజు బాధ కలిగింది. చేయి కూడా ఏదో ఆసరా కోల్పోయినట్లు ఫీలయింది. జడపదార్థాల పట్లే అలాంటి అనుభూతి ఉంటే, మనుషుల మధ్య సంబంధం గూర్చి చెప్పాల్సిన పనిలేదు. సాన్నిహిత్యం ప్రేమకు, అనురాగానికి పునాది. వ్యక్తిపట్ల ఇతర ఆకర్షణలు మరింత స్నేహాన్ని పెంచుతాయి. స్నేహమంటేనే ప్రేమ'' అన్నాడతను.

''మరి స్త్రీ పురుషుల మధ్య ఉండే ప్రేమ?''

''అదీ స్నేహమే. అయితే కొంత లైంగిక ఆకర్షణ కూడా జోడవుతుంది ఆ స్నేహానికి. మనిషి సంఘజీవి. ఒంటరిగా ఉండలేడు. తన ఒంటరితనాన్ని పోగొట్టుకోవటానికే ఎన్నో వ్యవస్థలు నిర్మించుకున్నాడు. అందులో వివాహ వ్యవస్థ ఒకటి. లైంగికాకర్షణ తోడైన స్నేహంలో జీవితాంతమూ సాగే స్నేహానుబంధమే దాని పరమార్థత. వట్టి సెక్స్ కోసమే అయ్యేటట్లయితే వివాహ వ్యవస్థ అక్కరలేదు'' అన్నాడు అతను.

రోహిణి, అతడి ఆలోచనలు, భావాలపట్ల ప్రభావితురాలైంది. ఇప్పుడామెకు అతని రూపంగాని, పేరుగాని గుర్తుకు రావటం లేదు. అతని ఆలోచనలు, మాటలు అతన్నో ఉన్నత మానవుడిగా ఆమెకు కన్పించేటట్టు చేసేవి. ఒకోరోజు విద్యార్థులు వెళ్ళిపోయినా, అతను వెళ్లమంటున్నా, అతనితో మాట్లాడుతూ కూర్చునేది. ఇప్పుడామెకు తాను తరచుగా చూసే సినిమాలు గుర్తుకురావటంలేదు. సినిమాలకు వెళ్లటం చాల వరకు తగ్గిపోయింది.

ఒకోసారి తల్లి విసుక్కునేది కూడా ''ఎంత సేపే మాష్టారితో కబుర్లు. ఇంట్లో పనీ పాటా చేసుకోవటమూ, చదువుకోవటమూలేదా?'' అని.

తండ్రి మాత్రం పట్టించుకునే వాడుకాదు. ఒకోస్సారి ఆయనా వచ్చి చర్చల్లో పాల్గొనేవాడు.

ఆయనకు ఆ వాతావరణం నచ్చింది. అందువల్ల కూతురు అక్కడకు రావటానికీ, మాట్లాడటానికీ అభ్యంతరపెట్టేవాడు కాదు ఆయన.

రోహిణి భావనాశీలి, కలల్లో తేలిపోయేది. ఇన్స్టింక్టివ్‌గా నరసింహమూర్తి తనను ప్రేమిస్తున్నాడని ఆమెకు తెల్సు. అయితే ఎంతసేపూ కబుర్లు తప్ప ఒక్క అడుగూ ముందుకేయడేం? దాంతో జీవితంలో థ్రిల్లింత లేకుండా పోతున్నట్లూ, డల్‌గా ఉన్నట్లూ ఆమె కన్పించేది. అతని మాటలు తన్ను భావనాలోకంలో విహరింప చేసినా, చేత లెంత మృదువుగా, థ్రిల్లింత కల్గించేవిగా ఉంటాయోనని ఆమె అనుకునేది. ''ఎప్పుడైనా తన చుట్టూ చెయ్యేసి, దగ్గరకు తీసుకుని 'రోహిణీ! ఐ లవ్యూ, ఐ వాంట్యూ' అంటే ఎంత థ్రిల్లింగా ఉంటుంది. నాక్కూడా మీరంటే ప్రేమే, సార్!' అంటుందా?

ఊహూఁ. 'ఐ టూ లవ్యూ' అని ఇంగ్లీషులోనే చెప్తే బావుంటుంది. అంతకంటే సినిమాలోలా-

'హలో సారు బలేవారు చెలి వలపు తెలుసుకోరు.

పైకెంతో చల్లని వారు తమరెంతో అల్లరివారు

నా మనసు దోచినారు' - అని తను పాడితే

'చాలు చాలు సరసాలు, ఇంక దూరంగా ఉంటేనే మేలు' అని ఆయన పాడతారు.

అసలాయనకు పాడటం వచ్చా? ఏమో వచ్చో లేదో. పాటలు రాకపోతే ఇబ్బందే, పాడటమొస్తే ఎంత బావుంటుంది!

'కనులు కనులతో కలబడితే ఆ తగవుకు ఫలమేమి?' అని తను పాడితే

'కలలే' అంటాడాయన.

'నా కలలో నీవే కనబడితే ఆ చొరవకు ఫలమేమి?' అని తను అంటే.

'మరులే' అంటాడాయన.

'మరులు మనసులో స్థిరపడితే ఆపై జరిగేదేమి?'

'సంసారం'

అలా అనుకోగానే ఆమె సిగ్గులు పూచిన ముద్ద మందారమైంది. 'ఇది జరిగేనా? ఎందుకు జరగదు? తమది జన్మజన్మల అనుబంధం. ఆమె మనస్సు సినిమా పాటను పాడేసుకుంది - 'ఈనాటి ఈ బంధమేనాటిదో, ఏనాడు పెనవేసి ముడివేసెనో!' దాంతో ఆమె వళ్ళు పులకరించింది. థ్రిల్లింతలయింది.

'ప్రేమకు పెళ్లే పర్యవసానం - అయితే తమ పెళ్ళికి ఆటంకాలేమైనా ఉన్నాయా?' అని

ఆలోచించిందో క్షణం. 'తమ ఇద్దరి కులం ఒకటేనా? కాదేమో. ఆయన కులం ఏదో తనకు తెలీదు. కులం ఒకటి కాకపోతే తల్లిదండ్రులొప్పుకుంటారా? ఊహూఁ ఒప్పుకోరు. తనకు తెల్సు వాళ్ల సంగతి. ప్రేమ చరిత్రలో తల్లిదండ్రులు అమర ప్రేమికుల నొకటి కాకుండా చేసిన సంఘటనలెన్నో. దేవదాసు - పార్వతి, లైలా - మజ్నూ తన ఆరాధ్యదైవాలు. కులం, వర్గం ప్రేమకు అడ్డుగోడలు. ఈ అడ్డుగోడల్ని దాటనివ్వని తల్లిదండ్రులు విలనుల్లాగా, వికెడ్ కార్క్టర్స్‌లా కన్పించారామెకు. 'తనూ వూర్కోదు. తల్లిదండ్రుల నెదిరిస్తుంది.'

'నువ్విలా కులాంతర వివాహం చేసుకుంటే చెల్లెళ్ల పెళ్ళిళ్లు కావు' అని పాత డైలాగు వల్లిస్తుంది తల్లి.

'ఈ కులాలు, మతాలు మనం తయారు చేసుకున్నవే. ప్రేమైక హృదయాలు కులాల, మతాల భేదాల్ని పరిగణించవు' అని తానంటుంది. అలా అంటే చాలా! ప్రేమమీద ఇంకా కొంచెం ఉపన్యాసం ఇస్తే బావుంటేందేమో. అయినా అంతకంటే ఏం చెప్తుంది. ఏం చెప్పినా వాళ్ల మూసుకుపోయిన చెవులు తెరిపిళ్లు పడేనా?

'అవేం మాటలే పెద్దమ్మాయి! కాస్త ఆలోచించుకు మాట్లాడు' అంటాడు తండ్రి.

'దీనికి పిచ్చి పట్టింది. కాలేజీ, గీలేజీ మాన్పించి గదిలోపెట్టి తాళం వేయండి. రెండురోజులు తిండి పెట్టకుండా మాడిస్తే ఈ ప్రేమ జ్వరం వదిలిపోతుంది' అంటుంది తల్లి.

'అసలా వీర వరాహ వేంకట నరసింహమూర్తిని గది ఖాళీ చేయించాలి' అంటాడు తండ్రి. కాస్తంత మృదువుగా ఆయనపేరు ఉచ్చరించకూడదూ. 'మూర్తీ' అంటే ఎంత బావుండును. ఊహూఁ ఆయన అలా ఎందుకంటాడు?! విలన్‌కదా!

'ఆయన్ని వెళ్లగొట్టినందువల్ల, నన్నుగదిలో పెట్టి తాళం పెట్టినందువల్ల మాప్రేమ విచ్ఛిన్నంకాదు. శరీరాలను బంధించగలరుగానీ, మనసులను బంధించలేరు మీరు' అంటుంది తాను సూటిగా డైలాగు బాణాన్ని సంధించి విడుస్తూ.

'దాంతో ఖంగుతిని తమ ప్రయత్నం మానేస్తారా? మానేయరు. చరిత్ర అదే చెప్తోంది. తన్ను కాలేజీ మాన్పించి గదిలోపెట్టి తాళం వేస్తారు. ఆయన్ని గదిలోంచి వెళ్లగొడ్తారు. తనకు బలవంతంగా పెళ్లి చేయప్రయత్నిస్తారు తల్లిదండ్రులు.

'కనుపాప కరవైన కనులెందుకూ
తనవారె పరులైన బతుకెందుకూ
..........
మరుమల్లె కెంధూళి కలసేందుకే.

విరజాజి శిలపైన రాలేందుకే' పాడుకుంటూంటే ఆమె కళ్లంబట నీళ్ళుకారాయి. 'అంతేనా తన జీవితం?'

ఆమె కళ్ళు తుడుచుకుంది. 'ఉహూఁ తనలా చూస్తూ ఊర్కోదు. తల్లిదండ్రులను, సమాజాన్ని ఎదిరించి తన ప్రేమ పంటను పండించుకుంటుంది. తాము ఆలుమగలై సంసారంలో సరిగమలు పండిస్తూ జీవిత యాత్ర సాగిస్తారు. 'సంసారం సంసారం ప్రేమసుధాపూరం నవజీవనసారం...'

''ఏవేఁ అమ్మాయి! కంచంలో అన్నంపెట్టి ఎంత సేపటి నుండో పిలుస్తుంటే పలకవేం. లే, లేచి అన్నంతిను. తర్వాత చదూకుందువుగాని లే'' అంటూ వచ్చింది రోహిణి తల్లి అనసూయ.

రోహిణికి తన మధురోహల దివినుండి భువికి విసరివేయబడ్డట్టయింది. అయోమయంగా తల్లివంక చూసింది, దిగాలుగా. స్పృహలోకివచ్చింది. అప్పుడామెకు తన ప్రేమను భగ్నం చేసే విధ్వంసకురాల్లాగా కన్పించింది తల్లి. అలా ఆమె వంక చూస్తూ కూర్చుంది కాని లేవలేదు. తల్లి అన్నమాటలు తలకెక్కలేదు.

''ఏంటే ఆ పరధ్యానం. లే, లేచి అన్నం తిను'' అంది తల్లి.

అప్పటికి గాని పూర్తి తెలివిడి కలగలేదు రోహిణికి. పుస్తకం మూసి లేచిందామె.

భోజనాల దగ్గర తండ్రి అడిగాడు.

''ఏవేఁ అమ్మాయి! చదువెలా సాగుతోంది. పరీక్షలు దగ్గరకొస్తున్నాయి. బాగా ప్రిపేరవుతున్నావా?'' అని.

''ఆఁ బానే చదువుతున్నా, నాన్నా!'' అంది రోహిణి.

''ఏం చదువో ఏమో. పుస్తకం ముందేసుకుని కలలుకంటూ కూర్చుంటుంది'' అంది అనసూయ.

''లేదునాన్నా! అక్క బానే చదువుతూంది. ఇప్పుడు సినిమాలకూ్కడా వెళ్లటంలేదు'' అంది రోహిణి పెద్ద చెల్లెలు నిర్మల. అక్క సినిమాలకు వెళ్లకపోవటంవల్ల, అక్కతో తనూ సినిమాలకు వెళ్లే అవకాశాలు తగ్గి బాధగా వుంది ఆమెకు.

''పెళ్ళి చేస్తే సరి'' అన్నాడు శివరావు, చిన్న కూతురి మాటలు పట్టించుకోకుండా.

''అవునూ, మన గదిలో అద్దెకుండే అబ్బాయి మనవాళ్ళే నంటిరిగా. అతన్ని హెచ్చరించక పోయారా?''

''అదే అడుగుదామనుకుంటూనే కుదరటం లేదు. రేపు కనుక్కుంటాలే'' అన్నాడు ఆయన.

''మీ సాచివేత మీదే. మళ్లీ రేపటిదాకా వాయిదా ఎందుకు? భోంచేసి వెళ్ళి, విషయం కదిలించరాదూ'' అంది అనసూయ.

''సరేలే'' అన్నాడు శివరావు.

'అయితే కులం ఒకటేనన్న మాట' ప్రేమలో థ్రిల్లింత పలుచనైనట్లనిపించింది రోహిణికి. 'కులం ఒకటే. పైగా తల్లిదండ్రులు విలనుల్లాగా కాకుండా తనపెళ్ళి ఆయనతో జరిపించాలని చూస్తున్నారు. తన కిక తమ ఉజ్జ్వల ప్రేమకై అకుంఠిత దీక్షతో పోరాటం సాగించాల్సిన పనిలేదు' అనుకుంటే చప్పచప్పగా ఉన్నట్లనిపించింది ఆమెకు. 'పోనీలే, అనవసరంగా తల్లిదండ్రుల నెదిరించాల్సిన పనిలేదు. ఇహ తామిద్దరూ ఏకం కావటానికి అడ్డంకులేమున్నాయి? ఏంలేవు. భావన ఎంత హాయిగా ఉంది' కల నిజమయినట్లనిపించింది ఆమెకు.

'ఈనాటి ఈ హాయి

కలకాదోయి నిజమోయి

నీ ఊహతోనే పులకించిపోయే

ఈ మేను నీదోయి

నీకోసమే ఈ అడియాసలన్నీ

నాచెంత నా ఆశ నీవే కదా' అంటూ ఆమె మనసు ఆనంద డోలికల్లో వూగిసలాడింది.

శివరావు వెళ్లి నరసింహమూర్తితో మాట్లాడివచ్చాడు. పక్క గదిలో పుస్తకం చదువుతున్నట్లు నటిస్తూనే తల్లిదండ్రుల మాటలు వినసాగింది రోహిణి.

''అతనితో మాట్లాడేనే. అతని కిష్టమే. వాళ్ల వాళ్లతో మాట్లాడమన్నాడు. గుడివాడట వాళ్లది'' అంటున్నాడు తండ్రి.

'పెద్ద కనుక్కొచ్చాడు. అతనికెందుకిష్టముండదు. తన్నడిగితే తను చెప్పేదిగా' అనుకుంది రోహిణి.

''ఆస్తి వివరాలు ఏమన్నా తెలుసుకున్నారా?'' అడిగింది అనసూయ.

''ఆఁ ఏదో చెప్పాడు. అతని మాటల్ని బట్టి నాకర్థమైనదేమిటంటే వాళ్లు మనకంటే బాగా ఉన్నవాళ్లు. మనం వాళ్లతో తూగ గలమా అనిపిస్తున్నది. వాళ్లడిగినంత కట్నమివ్వగలమా అని!''

''బావుంది. ముందసలు మాట్లాడకుండా ప్రయత్నించకుండానే కూర్చుంటే పన్లవుతయ్యా. రేపు ఆదివారమేగా, ఆఫీసుకు శెలవు. వెళ్లి మాట్లాడిరండి..''

''సరేలే, నీకెప్పుడూ హడావుడి. ఇప్పుడు దాని పెళ్ళికేం తొందర చదువుకుంటోందిగా.''

''ఏం చదువుల్లేండి. పెళ్లి చదువులేగా. ఆడపిల్లయింతర్వాత పెళ్ళి చేసి పంపించాల్సిందే కదా. తాత్సారం చెయ్యక, ముందీ సంబంధం సంగతి విచారించండి. పిల్లవాణ్ణి ఇన్ని రోజులుగా చూస్తున్నాం. మంచివాడు, బుద్ధిమంతుడు. పిల్లంటే ఇష్టపడుతున్నాడు. అయేదాన్ని కాలదన్నుకోవటమెందుకూ?'' అంది అనసూయ.

''సరేలే రేపు పొద్దున్నే గుడివాడ వెళ్తాగానీ, ముందు పక్కేయ్యి, నిద్రవస్తోంది'' అన్నాడు శివరావు ఆవలిస్తూ.

తల్లిదండ్రుల మాటలు విని రోహిణి ఆలోచనలో పడిపోయింది. 'బాగా ఆస్తిపాస్తులున్న వాళ్లు తమ సంబంధానికెందుకొప్పుకుంటారు. వాళ్ళు అడిగినంత కట్నం తన తండ్రి ఇవ్వగలడో, లేడో? అయినా కట్నం అడిగే ఈ సంబంధాన్ని తను చేసుకుంటుందా? ఈ బండ మొహం నాకు కట్నం వద్దు అని చెప్పగూడదూ. అసలీ పెద్దమనిషికి తల్లిదండ్రుల నెదిరించగల ధైర్యం ఉందా? అహఁ ఉన్నట్టులేదు. అంత మృదువుగా మాట్లాడే మనిషికేం ధైర్యం ఉంటుంది. అసలీయన తండ్రి ఎలాంటి మనిషో? బుంగ మీసాలు, లావుపాటి శరీరం, వేళ్లకు ఉంగరాలు - దేవదాసు తండ్రిలా వుంటాడా? బహుశ ఆయన పడనివ్వడు. ఆయన పడనిచ్చినా, ఆయన తల్లి ఎటువంటిదో - ఆమెకు మాత్రం కట్నం మీద ఆశ వుండదా? కట్నం అడిగే సంబంధం తను చేసుకోదు గాక చేసుకోదు. తండ్రి ఇవ్వగలిగినంత కట్నమే వాళ్లడిగినా తను అతన్ని చేసుకోదు.' ఆమె సినిమా హృదయం విషాదంగా ఆలపించింది-

'ఇదేనా మన సంప్రదాయమిదేనా

తరతరాలు సంఘంలో కరడుకట్టిన దురాచారం

వరకట్న పిశాచాల దురంతాల కోరలలో

అన్నెం పున్నెం ఎరుగని ఆడబ్రతుకు బలియేనా'

ఆమె కనిపించింది. 'కట్నానికి ఆశ పడేవాళ్లు ఎంతకైనా తగుదురు. పెళ్లయిన మర్నాటి నుండి 'అది తీసుకురా, ఇది తీసుకురా, మీనాన్ననడిగి డబ్బు తీసుకురా' అని తనను వేధించరూ? వేధిస్తారు. తను అసలే అభిమానం గల మనిషి. తను 'ఇంక మానాన్న ఏం ఇవ్వడు. ఇవ్వాల్సిందంతా ఇచ్చి పెళ్ళిచేశాడు. ఇంక ఇవ్వాల్సిందేమీ 'లేదు' అంటుంది. ఆ దుర్మార్గులు ఊరుకుంటారా? కిరసనాయిలు పోసి తన్ను తగలెట్టరూ?'

ఆ ఆలోచన రాగానే తన దౌర్భాగ్య పరిస్థితి తల్చుకుని ఆమె కళ్ల వెంట నీళ్లు రాసాగాయి. అతని తల్లిదండ్రులు భయంకర క్రూరమృగాల్లా కనపడసాగారామెకు. 'అతని తల్లి సూర్యకాంతం అంత గయ్యాళిదైనా అయ్యుంటుంది. తన నసలు భర్తతో మాట్లాడనిస్తుందా? అతనికి అక్కలు, చెల్లెళ్లు ఉన్నారా? వాళ్ళు ఎలాంటి వాళ్లో? తనమీద తల్లికీ, తండ్రికీ ఎక్కవేయటమే వాళ్ల పనేమో? తమ పిల్ల లేం చెప్పినా తల్లిదండ్రులు నమ్ముతారు. ఆ మాటల్ని పట్టుకుని వాళ్ళు తన్నేమయినా చేస్తే...' భవిష్యత్తు ఘోరంగా, భయంకరంగా కనిపించసాగింది రోహిణికి. కన్నీళ్లతో దిండు తడిసిపోయింది. ఎప్పుడో తెలియకుండానే నిద్ర పట్టేసింది ఆమెకు.

మర్నాడు పొద్దున ఆమె నిద్ర లేచేసరికే శివరావు గుడివాడ వెళ్లిపోయాడు. 'తను పొద్దున్నే లేచి

చెప్పి వుండాల్సింది తండ్రికి. తనీ పెళ్ళి చేసుకోదు, ఆయన వెళ్లాల్సిన పనిలేదని. ఆరోజంతా ఆమె అన్యమనస్కంగానే గడిపింది. బయట నరసింహమూర్తి గది వైపు చూడాలని కూడా అనిపించలేదు ఆమెకు.

సాయంకాలం ఏడింటికి శివరావు గుడివాడ నుండి తిరిగివచ్చాడు. ఆయన ముఖం చాలా ప్రసన్నంగా ఉంది. 'అయితే సంబంధం కుదుర్చుకొచ్చి ఉంటాడు తండ్రి. ఇహ తనకు లేదీ జన్మకు ముక్తి' అనిరోదించింది రోహిణి హృదయం.

కాళ్ళు కడుక్కున్న తర్వాత మంచి నీళ్లిచ్చి అడిగింది అనసూయ - ''ఏమన్నారు వాళ్ళు?'' అని.

''ఏమంటారు? వాళ్లు చాలా మంచివాళ్లు. అబ్బాయికి నచ్చితే మాకు నచ్చినట్టే అన్నారు'' అన్నాడు ఆయన.

''మరి కట్నం వగైరాలు మాట్లాడారా?''

''ఆఁ, ఆ సంగతీ ఎత్తాను. 'మీరు మాకు కట్నమేమీ ఇవ్వక్కరలేదు. మా అబ్బాయిని మేం అమ్ముకోం' అని చెప్పారు. 'పెళ్లి మాత్రం ఘనంగా చేయండి' అన్నారు.''

ఆ మాటలతో అనసూయ సంతోషించింది. 'ఉస్సు'రని నిట్టూర్చింది పక్క గదిలోని రోహిణి హృదయం. 'వాళ్లూ ఈయన లాంటి వాళ్లే నన్నమాట. అవున్లే ఇలాంటి మనిషి తల్లిదండ్రులింకెలా ఉంటారు' అనుకుంటూ తల్లిదండ్రుల మాటలు వినసాగింది రోహిణి.

''ఇంకా వివరాలు చెప్పండి. అడిగిందానికే సమాధానాలు చెప్పి ఊరుకుంటే ఎట్లా?' అని అడిగింది అనసూయ ఆత్రుతగా.

''ఇంకేం ఉన్నాయి. వాళ్లు ఆస్తిపరులే, సందేహం లేదు. అసలు ఇతను ఉద్యోగం చెయ్యాల్సిన అవసరంలేదు. అతనికో అక్క ఉంది. ఆమె పెళ్లి అయిపోయింది. ఓ పిల్లాడు కూడానట. అమ్మాయికి బాదరబందీలు ఏమీ ఉండవు. అన్నిటికంటే నాకు నచ్చింది వాళ్ల తీరు. చాలా మర్యాద చేశారు. 'మా అబ్బాయి మీ ఇంట్లోనేనా అద్దెకుండటం' అని అడిగారు. 'ఎండాకాలం సెలవుల్లో ముహూర్తాలున్నాయి. మీరే ఏదన్నా ముహూర్తం పెట్టించి కబురు చేయండి' అన్నారు. 'ముందు మీరొచ్చి పిల్లని చూసుకోండి' అన్నా. 'వస్తాం. అదేం అంత ముఖ్యంకాదు. అబ్బాయికి నచ్చితే మాకు నచ్చినట్లే' అన్నారు'' అని వివరించాడు శివరావు.

తల్లిదండ్రుల మాటలు వింటున్న రోహిణి హృదయం ఒక్కసారి ఆనందంతో త్రుళ్లింత ననుభవించి, నీరసంలో పడిపోయింది. 'కట్నం అక్కరలేదా? మనుషులు మంచివాళ్ళా? ఒక్కత్తే ఆడబిడ్డా? ఆమెకు పెళ్ళయిపోయిందా? ఘర్షణకవకాశమే లేదా? అయ్యో, ఏం చచ్చు సంబంధం వచ్చింది తనకు' అని థ్రిల్లింతలోని గాఢత లోపించటం నచ్చని ఆమె మనసు ఆలోచించింది.

'అసలీ మొద్దుమొహం చెప్పొచ్చుగా తండ్రికి విషయాలన్నీ. అనవసరంగా గుడివాడ పంపించాడు తన తండ్రిని' అనీ అనుకుంది ఆమె.

'అయ్యో! కాబోయేవార్ని మొద్దుమొహం అనవచ్చా?' 'తన ఇష్టం. ఆయన తన స్వంతం. మొద్దుమొహ మనుకుంటుంది, ముద్దు మొహమనుకుంటుంది' అనుకుంటే ఆమె బుగ్గల్లో వెచ్చని ఆవిర్లు వచ్చాయి.

పక్కగదిలో ఇంకా తల్లిదండ్రుల చర్చ సాగుతూనే ఉంది.

''రోహిణి చదువు ఈ ఏడుతో అయిపోతుందిగా. ఏప్రిల్లో పరీక్షలు కాగానే మేనెల్లో చేసేద్దాం పెళ్లి. ముహూర్తాలున్నాయేమో కనుక్కుంటాను'' అన్నాడు శివరావు.

''రెణ్ణెల్లల్లో అన్నీ సమకూర్చుకోవాలంటే అయే పనేనా, అప్పుడే మార్చి వచ్చింది'' అంది అనసూయ.

''నీ ముఖంలే. శుభస్య శీఘ్రం అన్నారు. రేపటినుండీ ఆ ప్రయత్నాల్లో ఉండు'' అన్నాడు శివరావు.

రాత్రి పక్కమీద పడుకున్న ఆమె మనసులో ఓ విధమైన అసంతృప్తి చోటుచేసుకున్నా, తన పక్కన మూర్తిని ఊహించుకున్న ఆమె మనస్సు ఆనంద లోకాల్లో తేలిపోసాగింది. 'పెళ్ళి నిశ్చయమైందని తెలిసి కూడా అతను ఊరుకుంటాడా? తన్ను పలకరించటానికీ... ప్రయత్నించడూ?'

'కం కం కం కంగారు నీకేలనే.

నావంక రావేలనే చెలి నీ కింక సిగ్గేలనే' అని 'శాంతినివాసం'లో నాగేశ్వర్రావులా పాడితే తను అనదూ-

'నో నో నో నీ జోరు తగ్గాలిగా

ఇక ఆపైన నీదానగా'

నీరసమైన చచ్చు పాఠ్య గ్రంథాలు చదవాలి అంటే కష్టంగా ఉంది రోహిణికి. పుస్తకాలు పక్కన పెట్టి కలల్లో తేలిపోసాగింది ఆమె.

ఓరోజు కాలేజీకి వెళ్తుంటే నరసింహమూర్తి వెనకనుండి ఆమెను పిల్చాడు. రోహిణి ఆగిపోయింది. సిగ్గుల మొగ్గైంది. 'ఈయన ఎట్లా మాట్లాడగలుగుతున్నారు. సిగ్గేయటంలేదా?' అనుకుంది.

''ఏప్రిల్ రెండు నుండి పరీక్షలట. ఎలా చదువుతున్నావు?'' అని అడిగాడు అతను ఆమెను కలుస్తూ.

''చదువుతున్నాను''

''చదువుతున్నానంటే కుదరదు. సాయంత్రం నాగదికిరా. చర్చించి ప్రణాళిక ఒకటి వేద్దాం. ఆ ప్రకారం చదువుదుగాని. ఆ మాట చెబ్దామంటే అసలు నువ్వు కనిపించటమేలేదు.''

''అమ్మా వాళ్లు ఏ మంటారో?''

''ఏమంటారు? ఇదివరకే ఏమనలేదు. ఇంక అన్నీ నిశ్చయమయ్యాక ఏమంటారు?'' అన్నాడతను ఆమె వంక చిలిపిగా చూస్తూ.

'ఫరవాలేదు. వీర వరాహ వేంకట నరసింహమూర్తికి కూడా కాస్తంత సరసం తెలుసు' అనుకుంది రోహిణి.

''వింటున్నావా నా మాటలు. కలలు కంటున్నావా?''

''సరే అలాగే వస్తాను సాయంత్రం'' అని కాలేజీ దగ్గర పడటంతో గబ గబా నడుచుకుంటూ వెళ్ళిపోయింది రోహిణి.

'కాబోయే భార్యతో ఇంత చప్ప చప్పగానా మాట్లాడేది. వెధవ పాఠాలు, పుస్తకాలు, చదువు. దానికి చర్చించి ప్రణాళికలు వేయాలట! పంచవర్ష ప్రణాళికలు వేస్తే సరి. ఇంతకంటే రసవంతమైన మాటలే లేవా? ఈయనకు ఒరిజనల్ తెలివితేటల్లేకపోతే సినిమాలు చూసయినా నేర్చుకోవచ్చునే-

నా హృదయంలో నిదురించే చెలీ కలలలోన కన్పించే సఖీ.
మయూరివై వయారివై నేడే నటనమాడి నీవే నన్ను దోచినావే'

అని పాడొచ్చుగా, లేకపోతే -

'ఓహోహో - పరుగులు తీసే నీ వయసునకు
పగ్గం వేసెను నా మనసూ- ఉరకలు వేసే నా మనసుని
ఉసి గొలిపెనులే నీ వయసూ' అనొచ్చుగా. ఉహూఁ లాభంలేదు. ఒట్టి అడవి గొడ్డు' అనుకుంది రోహిణి.

సాయంత్రం అతను రమ్మన్నట్టుగానే రోహిణి అతని గదికి వెళ్లింది. బావి దగ్గర స్నానం చేస్తూ కనిపించాడు అతను ఆమెకు. ఆమెను చూసి - ''రోహిణీ! సబ్బు తీసుకరావటం మరిచిపోయాను. లోపలుంటుంది తెచ్చి పెట్టు...'' అన్నాడతను.

'అమ్మో! సేవలు చేయించుకుంటున్నాడే ఇప్పటినుండే' అనుకున్న ఆమె బుగ్గలో కెంపులు విరిశాయి. 'అయినా ఏం మనుషో! బాత్‌రూం ఉన్నా దాంట్లో స్నానం చేయడు. బావి దగ్గర బక్కెట్లు బక్కెట్లు నీళ్లు తోడి పోసుకుంటాడు. అక్కడికీ ఆ మధ్య తల్లి అన్నది : నీళ్లు కాగపెట్టి ఇస్తాను. వేన్నీళ్ల స్నానం చేయండి - అని కాబోయే అల్లుడితో. ఊహూఁ, వింటేనా - అక్కర్లేదండీ చన్నీళ్ల స్నానం నాకలవాటే, పైగా ఆరోగ్యానికి కూడా మంచిది - అన్నాడు. అన్నీ పనికిమాలిన

మాటలు, అనుభవించటం చేతకాకపోతే సరి. ఈయన్నెట్లా సంస్కరించాలో' ఆలోచనలో పడిపోయింది రోహిణి.

గదిలో సబ్బు పెట్టి కోసం చూసింది. అదెక్కడా కనిపించలేదు. టేబుల్ మీద ట్రాన్సిస్టర్ కనబడితే అది ఆన్ చేసింది. వివిధ భారతిలో నుండి పాటలొస్తున్నాయి.

'కళ్లలో పెళ్లి పందిరి కనపడసాగె

పల్లకీలోన ఊరేగే ముహూర్తం మదిలో కదలాడే'

అని పాటొస్తోంది. ఆమె కళ్ళలోనూ పెళ్లి పందిరి మెదిలింది. 'నుదుట కళ్యాణ తిలకం, బుగ్గన చుక్క, పసుపు పారాణి పాదాలతో, కోరికల కాంతులీనే కళ్లు కిందకు దించుకుని కళ్యాణ వేదికకు వస్తుంది తను. ఆయన తన మెడలో తాళి...' ఊహల సన్నాయి సప్తస్వరాలు వాయిస్తూంటే తన్ను తాను మరిచిపోయింది రోహిణి. నరసింహమూర్తి సబ్బు పెట్టె తెమ్మన్న సంగతి ఆమెకసలు గుర్తేలేదు.

రేడియోలో పాట మారింది -

'అటు పాను వు ఇటు నువ్వు, అటు జాబిలి ఇటు నువ్వు

నడుమ బిడియం నలిగింది గడుసు పరువం నవ్వింది...'

అటు పానువు, జాబిలి, ఆ మొదటి రాత్రి ఊహకు ఆమె గుండె ఝల్లుమంది. గుండెలో దడ, వణుకు వచ్చాయి. 'తను సినిమాలో హీరోయిన్‌లా పాల గ్లాసుతో గదిలో కడుగుపెడుతుంది. తన మనసు పాడుతూంటుంది-

'మెల్ల మెల్ల మెల్లగా అణువణువూ నీదెగా

మెత్తగ అడిగితే లేదనేది లేదుగా' - అంటూ

'తను తలుపు దగ్గరే నిలబడుతుంది. అతనొచ్చి తనను దగ్గరకు తీసుకుంటాడు.... ఏవోఁ! పరధ్యానం మనిషి. నమ్మలేం! అక్కడ కూడా పుస్తకం తీసి చదువుకుంటూ కూర్చుంటాడేమో! తనొచ్చిన సంగతి గమనించడేమో. తనెంతసేపు నిలబడాలి పాల గ్లాసు పట్టుకుని! ఛీ! ఇదేం మనిషి? సరసం, సరాగం తెలీదు. తను మాత్రం ముందెలా పలుకరిస్తుంది? తనకు సిగ్గెయ్యదూ? తనలాగే నిలబడుతుంది. అరగంటయినా పుస్తకం తీయడు. ఏం మనిషో? తనకు కోపం వస్తుంది. పాల గ్లాసు బల్లమీద పెట్టి అతని చేతిలో పుస్తకం లాక్కుని వీధిలోకి గిరవాటెడుతుంది...'

''అబ్బ! ఏవిటిది? పుస్తకం విసరివేస్తున్నావెందుకు?'' అన్నాడు - సబ్బు లేకుండానే స్నానం చేసి వస్తున్న నరసింహమూర్తి, ఆమె విసరిన పుస్తకం తనకు తగలటంతో.

అతని మాటలకు రోహిణి కల భగ్నమయింది. 'అది తమ మొదటి రోజు కాదు, ఇంకా పెళ్లే

కాలేదు. తనింకా ఆ దరిద్రపు పరీక్షలు రాయాల్సే ఉంది. అన్నీ అయిపోయినట్లే ఊహించి తన చేతిలోని పుస్తకం అతని పైకి విసిరింది.' ఏం చెప్పాలో తోచలేదు రోహిణికి. ''ఓ... సారీ...'' అని మాత్రం అనగలిగింది.

''నా మీద కోపం పుస్తకం మీద చూపెడ్తే ఎట్లా?'' అన్నాడతను.

''మీ మీద కోపమెందుకు నాకు...?'' అంది ఆమె.

''నీలాగ కలల్లో బతకనందుకు. ఎప్పుడూ ఏదో థ్రిల్ కోసం ఎదురుచూస్తూ ఉంటుంది నీ మనసు. ఏదో జరుగుతుందని ఎదురుచూసే మనసుకు ఏం జరక్కపోతే నిరాశ, నిస్పృహలు కలుగుతాయి. అసలు ఏం జరక్కపోవటమే పెద్ద థ్రిల్. అనుకున్నది జరగటంలేదన్న అసంతృప్తి జరుగుతున్న సంఘటనల్లోని థ్రిల్‌ని లుప్తం చేస్తుంది...''

''నేను చెప్పానా మీకూ, నా మనసెప్పుడూ థ్రిల్లింతకై ఎదురుచూస్తుందని...''

''చెప్పకేం, చెప్పక చెప్పావు. ముందు ట్రాన్సిస్టర్‌లోపాట విను. చక్కటి పాట'' అంటూ ట్రాన్సిస్టర్ వాల్యూం పెంచాడు లుంగీ కట్టుకుని, షర్టు తొడుక్కుంటూ నరసింహమూర్తి.

'కొండగాలి తిరిగింది గుండె ఊసులాడింది

గోదావరి వరద లాగ కోరిక చెలరేగింది. ఆ...

.......

మొగలి పూల వాసనలో జగతి మురిసిపోయింది.

నాగమల్లి పూలతో నల్లని జడ నవ్వింది

పడుచుదనం అందానికి తాంబూల మిచ్చింది

ప్రాప్తమున్న తీరానికి పడవ సాగిపోయింది'

పాట వింటూ తమ్ముతాము మరచిపోయారిద్దరూ.

''చక్కటి పాట కదూ?'' అన్నాడతను తేరుకుంటూ.

''అమ్మో! మీకు పాట లంటే ఇష్టమేనన్నమాట. ఎంత థ్రిల్లింతో...'' అంది రోహిణి తన్మయత్వంతో.

''పాటలిష్టమే. చక్కటి కవిత్వ మున్నపాట లిష్టం'' అంటూ ట్రానిస్టర్ ఆపేశాడతను.

''ఆపారెందుకని?''

''రాబర్ట్ ఫ్రాస్ట్ అన్నాడు - 'ఐ హావ్ మైల్స్ టు గో బిఫోర్ ఐ స్లీప్' అని. చుట్టూ హృదయాహ్లాదకరమైన ప్రకృతి. ఆయన కక్కడనుండి వెళ్లిపోవాలని లేదు. అయినా

ఉండలేకపోయాడు. తను నిర్వర్తించాల్సిన కర్తవ్యం ఆయన్నక్కడ ఉండనివ్వలేదు. రసదృష్టికీ, కర్తవ్య నిర్వహణకీ మధ్య ఘర్షణ ప్రతి మనిషి జీవితంలోనూ ఎదురవుతూనే ఉంటుంది. ఏదీ పరిత్యజించని వాడే సరైన మనిషి. నవజీవన బృందావనం కలల్లోనే మిగిలిపోకూడదు. ప్రయత్నించి మనం దాన్ని ఈ భూమ్మీద సృజించుకోవాల్సి ఉంటుంది...''

ఆమె అతని మాటలు అప్రతిభురాలై వింటోంది.

''అసలు నువ్వంటే నాకెందుకిష్టమో తెల్సా- నీకు కలలు కనే స్పందనా, హృదయముందనే...''

ఆమె మనసు థ్రిల్లింతలనుభవిస్తోంది, 'ఈయనకూ మాటలు వచ్చే! ఏమో అనుకున్నాను' అనుకుంది.

''ఊహించే మనసుతో, మంచితనంతో నలుగురికీ ఉపయోగపడేటట్లు బతకటంలో ఉంది థ్రిల్. ప్రాప్తమున్న ఈ తీరానికి వచ్చిన పడవా! అప్పుడే జీవితంలో అసలు థ్రిల్లింత'' అంటూ పుస్తకం తీశాడతను.

'ఆంధ్రప్రభ' సచిత్రవారపత్రిక
జూలై 15-21, 1992